ప్రజాశక్తి

సోమవారం 6 మే 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

జిత్తుల మారి ఎత్తులు

◆ ప్రజలు, పార్టీల మధ్య చిచ్చురేపుతున్న బిజెపి ఎంపీ అభ్యర్థి సిఎం.రమేష్

◆ తారువ, చౌడువాడల్లో ఘర్షణలకు దిగిన కూటమి, వైసిపి కార్యకర్తలు

◆ కొద్ది రోజుల క్రితం జిఎస్‌టి అధికారిపైనా రమేష్ దురుసు ప్రవర్తన ◆ జిల్లాలో దెబ్బతింటున్న ప్రశాంతత

శనివారం దేవరాపల్లి మండలం తారువలో ఘర్షణ పడుతున్న కూటమి, వైసిపి కార్యకర్తలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఏ బలమూలేని చోట విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయాలు చేసే బిజెపి ప్రయోగాన్నే అనకాపల్లి లోక్‌సభలో ఆ పార్టీ అభ్యర్థి సిఎం.రమేష్ ఎంచుకున్నట్లుంది. సార్వత్రిక ఎన్నికల్లో లోక్‌సభ పరిధిలో ఏనాడూ లేని వరుస గొడవలు ఈనాడు చోటుచేసుకోవడం వెనుక స్థానికేతరుడైన సిఎం రమేష్ కారణమన్న చర్చ సర్వత్రా జరుగుతోంది. పల్లెల్లో పగలు పెంచి, కలిసిమెలిసి బతుకుతున్న ప్రజలను విడదీసి విషం చిమ్మే వ్యూహాలు పన్నుతున్నారన్న విమర్శలూ వినిపిస్తున్నాయి. తమ పార్టీకి ఏ బలమూ లేకపోవడంతో టిడిపి ఓటును గట్టిపర్చుకొనేందుకు టిడిపి, వైసిపి మధ్య చిచ్చు పెడుతున్నట్లు కనబడుతోంది. ఈ పగలు, గొడవల్లో టిడిపి కార్యకర్తలు ఇరుక్కుపోతున్నారు. తనను టిడిపి, జనసేన శ్రేణులు సొంతం చేసుకొని పనిచేయడానికి రమేష్ ఈ ఎత్తులు వేస్తున్నట్లుందని సీనియర్ రాజకీయ నాయకులు అంటున్నారు. ప్రజలతో ఏ స్నేహమూ, బంధుత్వమూ లేకపోయినా, అధికారిక విధుల్లోనూ, కుటుంబ వ్యవహారాల్లోనూ ఆయన మితిమీరిన జోక్యం చేసుకోవడంతో కొత్త వివాదాలు ముదిరి జిల్లాలో ప్రశాంతత దెబ్బతినడానికి దారితీస్తున్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఆయన గెలిచినా, ఓడినా ఇక్కడ ప్రజలకు అందుబాటులోవుండే వ్యక్తికాదు.. సమస్యలు అర్థం చేసుకొని పరిష్కరించే నాయకుడూ కాదన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

కొద్దిరోజుల క్రితం చోడవరం గాంధీ గ్రామంలో టైల్స్ షాపులో ఎపి స్టేట్ జిఎస్‌టి డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలిజెన్స్ అధికారుల తనిఖీల మిగతా 2లో..

అక్కయ్యపాలెం సమీపంలోని కేంద్రీయ విద్యాలయానికి నీట్ పరీక్ష కోసం వచ్చిన విద్యార్థులు

ప్రశాంతంగా నీట్ పరీక్షలు

ప్రజాశక్తి - ఆనందపురం, విశాఖపట్నం : వైద్య విద్యా కోర్సులకు సంబంధించిన జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్) విశాఖ జిల్లాలో ఆదివారం ప్రశాంతంగా సాగింది. అక్కయ్యపాలెం సమీపంలోని కేంద్రీయ విద్యాలయం సెంటర్ వద్ద విద్యార్థుల హడావుడి కనిపించింది. అక్కడ పరీక్ష సజావుగా సాగింది. ఆనందపురం మండలం గుడిలోవలోని ఎక్కుజె పీజీ కళాశాలలోనూ నీట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. కళాశాలలో 900 మంది నీట్ పరీక్షకు హాజరైనట్లు యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షను నిర్వహించారు.

ప్రజాశక్తి సీనియర్ పాత్రికేయులు అప్పారావు మృతి

వార్త 7లో..

తాగునీటి సమస్యపై ఆందోళన

వార్త 7లో..

సంబల్‌పూర్ - కాచిగూడ మధ్య ప్రత్యేక రైళ్లు

వార్త 2లో..

నేడు కశింకోటలో మోడీ సభ

పలుచోట్ల ట్రాఫిక్ ఆంక్షలు

ప్రజాశక్తి - కశింకోట : ప్రధాని నరేంద్ర మోడీ సోమవారం అనకాపల్లి జిల్లాకు రానున్నారు. కశింకోట మండలం రాజుపాలెం జాతీయ రహదారి పక్కన జరిగే ఎన్నికల బహిరంగ సభలో సాయంత్రం 5.45 నుంచి 6.35 గంటల వరకు ఆయన ప్రసంగిస్తారు. ఈ సభకు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు హాజరుకానున్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి కార్యకర్తలను తరలించే ఏర్పాట్లులో కూటమి నేతలు ఉన్నారు.

రాజుపాలెం జాతీయ రహదారి పక్కన జరగనున్న మోడీ బహిరంగ సభ సందర్భంగా ట్రాఫిక్ మళ్లించినట్లు ఎస్‌పి కెవి.మురళీ కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంటైనర్లు, టిప్పర్లు, లారీలు, భారీ వాహనాలను ట్రాఫిక్ దృష్ట్యా మళ్లిస్తున్నట్లు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట నుండి సాయంత్రం ఆరు గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపు వుంటుందని పేర్కొన్నారు. ఆ ప్రకారం.. విశాఖపట్నం నుంచి తుని వైపు జాతీయ రహదారి మీదుగా వెళ్లే వాహనాలు లంకెలపాలెం జంక్షన్ నుంచి పరవాడ, అచ్యుతాపురం, యలమంచిలి, రేగుపాలెం జంక్షన్ జాతీయ రహదారి మీదుగా తుని చేరుకోవాలి. తుని నుంచి విజయనగరం, విశాఖపట్నం వచ్చే వాహనాలు తుని, రేగుపాలెం జంక్షన్, యలమంచిలి బైపాస్, అచ్యుతాపురం, పరవాడ, లంకెలపాలెం జంక్షన్, అసకపల్లి జంక్షన్ మీదుగా విజయనగరం, శ్రీకాకుళం, దేశపాత్రునిపాలెం నుంచి జాతీయ రహదారి మీదుగా విశాఖపట్నం మిగతా 2లో..

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రారంభం

విశాఖలో తొలి రోజు ప్రశాంతం ◆ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి : కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జిల్లాలో ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ఇతర జిల్లాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకునే కార్యక్రమం ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు, ఇంగ్లీషు మీడియం పాఠశాలలో ఆదివారం ప్రారంభమైంది. తొలి రోజు ఓటింగ్ ప్రక్రియ సజావుగా సాగింది. పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి ఓటరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఉద్యోగులు ఓటుహక్కును వినియోగించుకునేందుకు అన్నిరకాల ఏర్పాట్లు చేశామన్నారు. ఏడు నియోజకవర్గాలకు సంబంధించి ఏడు కేంద్రాలను, ఇతర జిల్లాల ఉద్యోగులు వారి

ఎయులో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను వినియోగించుకుంటున్న ఉద్యోగులు

కేంద్రాన్ని తెలుసుకునేలా రిసెప్షన్ సెంటరును ఏర్పాటుచేసినట్లు చెప్పారు. ఏ జిల్లా వారు ఏ గదికి వెళ్లాలనేది స్పష్టంగా తెలియజేసేలా పెద్ద పోస్టర్లను అతికించామన్నారు. వేసవి దృష్ట్యా ఓటర్లకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా ఉండేందుకు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

జిత్తుల మారి ఎత్తులు

వెనుక చోడవరం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ హస్తముందంటూ సిఎం రమేష్ బీభత్సం సృష్టించి జిఎస్‌టి అధికారుల చేతిలోని ఫైళ్లను లాక్కున్నారు. తనిఖీలు చేయకుండా విధులకు ఆటంకం కలిగించారు. ముత్యాలనాయుడు సొంతూరు తారువకు శనివారం రమేష్ కార్యకర్తలను వెంటబెట్టుకొని వెళ్లడంతో వైసిపి, టిడిపి కార్యకర్తల మధ్య అక్కడ గొడవకు దారితీసింది. బూడి బావమరిది గంగాధర్ డ్రోన్‌తో తారువలో బిజెపి జెండా ఎగరవేయడంపై వారిద్దరి మధ్య జరిగిన గొడవ దగ్గర బంధువులు కావడంతో సద్దుమణిగింది. అయితే, ఈ వివాదంలోకి రమేష్ ప్రవేశించడంతో సమస్య రాజకీయమైంది.

కె.కోటపాడు మండలం చౌడవాడలోకి వైసిపి ప్రచార వాహనం రాకుండా టిడిపి కార్యకర్తలు అడ్డుకోవడంతో టిడిపి, వైసిపి కార్యకర్తల మధ్య ఆదివారం తోపులాట జరిగింది. ఈ గొడవలు వెనుక సిఎం రమేష్ పాత్ర వుందన్న ప్రచారం బలంగా జరుగుతోంది. కూటమిలోని టిడిపి బలం, చంద్రబాబు సహచర్యం, కేంద్ర బిజెపి నాయకత్వ పరిచయాలతో దూకుడుగా వెళ్తున్న రమేష్‌తో ఎన్నికల్లో కొత్త సమస్యలు వస్తాయన్న టిడిపి నాయకుల అంచనాకు తగినట్లు పరిణామాలున్నాయి. బిజెపి బలపడితే తమ పార్టీ బలహీనపడుతుందన్న భయమూ వారిలో వ్యక్తమవుతోంది. ఒకవైపు జిత్తుల మారి ఎత్తులు వేస్తూనే, అభివృద్ధి తనవల్లే సాధ్యమన్నట్లు మాట్లాడి ప్రజలను రమేష్ నమ్మించచూస్తున్నారు.

వాస్తవానికి జిల్లా అభివృద్ధి, ప్రజలపై ఏ మాత్రం ఆయనకు చిత్తశుద్ధివున్నా 12 ఏళ్ల తన రాజ్యసభ పదవీకాలంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ మాట్లాడేవారు. సొంత గనులు కేటాయించాలని పట్టుబట్టేవారు. ఎన్ఎఒబి నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేసేవారు. నాన్‌షెడ్యూల్ గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్ జాబితాలో చేర్చాలని అడిగేవారు. వెనుకబడ్డ ఉత్తరాంధ్రకు ఇవ్వాల్సిన నిధులు నిలిపివేసిన కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు వచ్చేలా చూసేవారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి, పునరావాసం, పరిహారానికి నిధులు రాబట్టేవారు. రాష్ట్ర విభజన చట్ట హామీలు అమలుకు బిజెపిపై ఒత్తిడితెచ్చేవారు. ఇలా తన కళ్లముందున్న సమస్యలను పదిలిపెట్టి, వీపు వెనుకనున్న సమస్యలను చూసి పరిష్కరిస్తానని ప్రజలను నమ్మించబూనుకుంటున్నారు. తాజా పరిణామాలన్నీ పరిశీలిస్తే ప్రజలు వాస్తవాలు గుర్తెరిగి బిజెపి అభ్యర్థి సిఎం రమేష్‌ను ప్రజాతీర్పుతో సాగనంపకపోతే వారు సాగిలపడాల్సిన పరిస్థితులు మున్ముందు దాపురించనున్నట్లు పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఎయిలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రారంభం

షామియానా, తాగునీరు వంటి మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. ఈ నెల 8వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, ఉద్యోగులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కొన్ని శాఖలకు ప్రత్యేక తేదీలు కేటాయించామని, తద్వారా వారు వారికి కేటాయించిన రోజున వచ్చి ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉంటుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు.

7, 8 తేదీల్లో హోం ఓటింగ్ ప్రారంభం

ఈ నెల 7, 8 తేదీల్లో హోం ఓటింగ్ కార్యక్రమం జరగనుందని, వాటికి సంబంధించిన ఏర్పాట్లు కూడా పూర్తయ్యాయని అన్నారు. ఆ రెండు రోజుల్లో వినియోగించుకోలేకపోయిన వారికి 9వ తేదీన ప్రత్యేక అవకాశం కల్పించినట్లు స్పష్టం చేశారు. అలాగే ఈ నెల 13వ తేదీన ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకూ పార్లమెంటు, శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించి పెద్దఎత్తున ఓటర్లు తరలివచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. గత ఎన్నికల్లో 66 శాతం ఓటింగ్ నమోదైందని, ఈ ఎన్నికల్లో 80 శాతం ఓటు హక్కును వినియోగించుకునేలా జిల్లాలో స్వీప్ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించి ఓటర్లలో అవగాహన కల్పించినట్లు చెప్పారు. జిల్లాలో 1991 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 502 క్లిష్టమైన పోలింగ్ కేంద్రాలుగా గుర్తించి, ఎక్కడా ఎటువంటి సమస్యలూ తలెత్తకుండా ఉండేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. అన్నిచోట్ల వెబ్ కాస్టింగ్, సూక్ష్మ పరిశీలకులు, వీడియోగ్రాఫర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వేసవి దృష్ట్యా ప్రతి కేంద్రం వద్ద షామియానా, కుర్చీలు, తాగునీరు వంటి మౌలిక వసతులు కల్పించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్స్, విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జెసి కె.మయూర్ అశోక్, జివిఎంసి ఎడిసి కెఎస్.విశ్వనాథన్, ఇతర పోలింగ్ అధికారులు పాల్గొన్నారు.

సంబల్‌పూర్ - కాచిగూడ మధ్య ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల అదనపు రద్దీ దృష్ట్యా ఈస్ట్ కోస్ట్ రైల్వే దువ్వాడ మీదుగా సంబల్‌పూర్ - కాచిగూడ మధ్య ప్రత్యేక రైళ్లను నడపాలని నిర్ణయించింది. ఈ క్రమంలో 08323 సంబల్‌పూర్-కాచిగూడ వేసవి ప్రత్యేక రైలు మే 13 నుంచి జూన్ 24 వరకు ప్రతి సోమవారం రాత్రి 21.00 గంటలకు సంబల్‌పూర్‌లో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 07.20 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 07.25 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 21.50 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది. 08324 కాచిగూడ - సంబల్‌పూర్ వేసవి ప్రత్యేక రైలు మే 14 నుండి జూన్ 25 వరకు ప్రతి మంగళవారం రాత్రి 23.20 గంటలకు కాచిగూడలో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 12.35కి బయలుదేరి అదేరోజు రాత్రి 23.45 గంటలకు సంబల్‌పూర్ చేరుకుంటుంది.

ఈ రైళ్లు బార్‌ఘర్ రోడ్డు, బలంగీర్, తిట్లాగఢ్, కేసింగ, మునిగూడ, రాయగడ, పార్వతీపురం, బొబ్బిలి, విజయనగరం, కొత్తవలస, పెందుర్తి, దువ్వాడ, అనకాపల్లి, తుని, పిఠాపురం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, మిర్యాలగూడ, నల్గొండ, చెర్లపల్లి, మల్కాజిగిరి మీదుగా ప్రయాణిస్తాయి. వీటిని ప్రజలు వినియోగించుకోవాలని రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ కోరారు. వీటిల్లో అన్ని ఏర్పాట్లూ చేశామని తెలిపారు.

వైసిపిలో చేరిన హోమియో వైద్యుడు రియాజ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : హోమియో వైద్యుడు ఎమ్‌డి రియాజ్ అహ్మద్ వైసిపి దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్ సమక్షంలో వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. 38వ వార్డు బీచ్ రోడ్డు ఆసుపత్రి ప్రాంగణంలో ఆదివారం వైసిపి నాయకులు పాటోజు ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రియాజ్‌కు వాసుపల్లి వైసిపి కండువా కప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కోసూరు సురేష్, గురజాపు రవి, బాబ్జీ, పెదబాబు, చిన్ని కృష్ణ పాల్గొన్నారు.

డాక్టర్ రియాజ్‌తో వైసిపి దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి

కూటమి ప్రచారానికి స్పందన : గంటా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నెల రోజులుగా కూటమి పార్టీలు చేపడుతున్న ఎన్నికల ప్రచారానికి మంచి స్పందన దక్కుతోందని టిడిపి భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ఎంవిపి.కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో భారీ మెజార్టీతో కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తారని, జూన్ 9న చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఓటమి భయంతోనే వైసిపి శ్రేణులు దాడులకు దిగుతున్నాయన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై ఎన్నో సందేహాలు ఉన్నాయని తెలిపారు. భీమిలి లోకల్ మేనిఫెస్టో రెండు రోజుల్లో విడుదల కానుందన్నారు.

నేడు మెకానిక్‌లకు ఎస్‌కెఎఫ్ శిక్షణ శిబిరం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రత్యేకంగా వాణిజ్య వాహనాల మెకానిక్‌ల కోసం రూపొందించబడిన 'ఇన్వాల్ కాన్ఫిడెన్స్, ఇన్వాల్ ఎస్‌కెఎఫ్' అనే దేశవ్యాప్త ట్రక్ యాక్టివేషన్ ప్రచారాన్ని సమగ్రంగా నిర్వహిస్తున్నామని ఎస్‌కెఎఫ్ ఇండియా ప్రతినిధి అళగేసన్ థాసరి అన్నారు. ఆదివారం ఉదయం సిరిపురంలోని వివాన్ హోటల్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 6న విశాఖపట్నంలోని మెకానిక్‌లతో శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఎస్‌కెఎఫ్ కమర్షియల్ వెహికల్ ఉత్పత్తుల గురించి అవగాహన కల్పించడం, ఆటోమోటివ్ రంగంలో సుస్థిరతకు మద్దతు ఇవ్వడం ద్వారా మెకానిక్‌ల జీవితాలను క్రమబద్ధీకరించడంలో కీలక పాత్రను ప్రదర్శించడమే ఈ కార్యక్రమం ప్రాథమిక లక్ష్యమని పేర్కొన్నారు.

రోడ్లు నిర్మిస్తేనే ఓట్లు వేస్తాం

పివిటిజిల వినూత్న నిరసన

ప్రజాశక్తి-అనంతగిరి: తమ పివిటిజీ గ్రామాలకు రోడ్లు వేస్తేనే ఓట్లు వేస్తామని, లేకుంటే ఎన్నికలను బహిష్కరిస్తామని గుర్రలెక్కి వినూత్న రీతిలో పివిటిజీలు నిరసన చేపట్టారు. మండలంలోని మడ్రెబు, దాయార్తి గ్రామాలకు చెందిన పివిటిజిలు ఆదివారం గుర్రలెక్కి వినూత్న రీతిలో నిరసన చేపడుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పివిటిజి ఆదివాసి గిరిజన సంఘం మండల నాయకులు కె.నర్సింగరావు, కె.దాసు, ఎస్.సుధాకర్‌లు మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చి ఏళ్ళు గడుస్తున్నా పివిటిజీ గ్రామాలు అభివృద్ధి చెందలేదన్నారు. పివిటిజిల సంక్షేమం, అభివృద్ధికి కోట్ల నిధులు వెచ్చిస్తున్నట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మాటలు ప్రకటలకే పరిమితమయ్యాయన్నారు. కనీసం రోడ్డు సౌకర్యం లేదని, దీంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మడ్రెబు గ్రామంలో 45 కుటుంబాలు 170 జనాభా, 70 మంది ఓటర్లు ఉన్నామని, పెద్దకోట పంచాయతీ పెద్దకోట, వేలమామిడి పోలింగ్ బూత్‌లో ఓట్లు వేసేందుకు 30 కిలో మీటర్లు వెళ్ళవలసి ఉంటుందని తెలిపారు. 2017, 2022 సంవత్సరంలో రోడ్డు నిర్మించేందుకు నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు పూర్తి చేయకుండా వదిలి వేసారని, దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకున్న నాధుడే కరువయ్యారన్నారు. రోడ్డు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

గుర్రాలతో నిరసన చేపడుతున్న పివిటిజిలు

నేడు కశింకోటలో మోడీ సభ

(మొదటి పేజీ తరువాయి..)

చేరుకోవాలి. సబ్బవరం జాతీయ రహదారి మీదగా వచ్చే వాహనాలు అసకపల్లి, లంకెలపాలెం జంక్షన్, పరవాడ, అచ్యుతాపురం, యలమంచిలి బైపాస్, రేగుపాలెం జంక్షన్ జాతీయ రహదారి మీదుగా తుని చేరుకోవాలి. చోడవరం నుంచి తుని వైపు వెళ్లే వాహనాలు అనకాపల్లి బ్రిడ్జి, మునగపాక, పూడిమడక రోడ్డు, అచ్యుతాపురం జంక్షన్, యలమంచిలి బైపాస్, రేగుపాలెం జంక్షన్ జాతీయ రహదారి మీదుగా తుని వెళ్లాలి.

పింఛన్‌దారుల మరణాలకు ప్రభుత్వానిదే బాధ్యత

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పింఛన్‌దారుల మరణాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. బ్యాంకులకు వెళ్లి పింఛను సొమ్ము తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించినందున ఫించన్‌దారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

ఉపాధి హామీ పనులు కల్పించరూ..

ప్రజాశక్తి-అచ్యుతాపురం : తిమ్మరాజుపేట గ్రామంలో ఉపాధి హామీ చట్టం కింద పనులు కల్పించాలని ఆ గ్రామానికి చెందిన కూలీలు కోరుతున్నారు. ఈ గ్రామంలో ఉపాధి హామీ పనులు చేపట్టకపోవడంతో100 మందికి పైగా కూలీలు రోజూ పని లేక ఖాళీగా ఉంటున్నామని చెబుతున్నారు. గత సంవత్సరం కష్టపడి ఎండలలో పనిచేసిన కూలీలకు నేటి వరకు పనిచేసిన కూలి డబ్బులు రాలేదని మరికొందరు చెబుతున్నారు. ఒకవైపు చేసిన పనికి డబ్బులు ఇవ్వక, ఈ సంవత్సరంలో పనులు ప్రారంభించక ఉపాధి కూలీల గోల పట్టించుకునే నాధుడు కరువయ్యారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదని వారు అంటున్నారు. ఓట్ల కోసం అయితే వస్తున్నారు కానీ తమకు రావలసిన ఉపాధి కూలి సొమ్ము ఇప్పించడానికి ఎవరు రావడంలేదని చెబుతున్నారు. మండలంలో మిగిలిన గ్రామాల్లో ఉపాధి పనులు చేస్తూ కుటుంబ పోషణకు ఆర్థికంగా సంపాదిస్తున్నారని, మరి తిమ్మరాజుపేట గ్రామంలో ఉపాధి కూలీలకు కుటుంబ పోషణ పట్టించుకోని అధికారులు అంతర్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు కల్పించకపోతే మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

రంపచోడవరం : రంప చోడవరం ఎస్ఈబి సిఐ ఇంద్రజిత్తు, ఎస్సై అబ్దుల్ అలీమ్ ఆధ్వర్యాన వై.రామవరం మండలం బొడ్డుమామిడి గ్రామంలో ఆదివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఇతర రాష్ట్రానికి చెందిన మద్యాన్ని (ఎన్‌డిపిఎల్) అక్రమంగా అమ్ముతున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని, అయన నుండి 145 సీసాలు (26.265 లీటర్ల మద్యం, 24.5 లీటర్ల బీర్)ను స్వాధీనం చేసుకున్నారు. నిందితునిపై కేసు నమోదు చేశారు.

ఇండియా ఫోరం అభ్యర్థులను గెలిపించాలి

ప్రజాశక్తి-గాజువాక : కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని, వారికి సహకరిస్తున్న టిడిపి వైసిపిలను ఓడించి ఇండియా ఫోరం అభ్యర్థులను గెలిపించాలని సిఐటియు నాయకులు ఎన్.రామారావు పెన్షన్‌దారులను కోరారు. పెదగంట్యాడ సిడబ్ల్యూసిలో ఆదివారం పెన్షనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇపిఎఫ్-95 పెన్షనర్లకు హయ్యర్ పెన్షన్ ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా అమలుచేయకుండా కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. సమయం పచ్చింది కాబట్టి ఈ ప్రభుత్వాన్ని వెంటనే గద్దె దించాలని కోరారు. సమస్య పరిష్కారమవ్వాలంటే ఇండియా కూటమి తరుపున ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న ఎం.జగ్గునాయుడును, విశాఖ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి సత్యారెడ్డిని గెలిపించాలని కోరారు. అసోసియేషన్ అధ్యక్షులు కణితి అప్పలరాజు మాట్లాడుతూ, పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని, మెడికల్ సౌకర్యం కల్పించాలని, రైలు ప్రయాణాల్లో 50 శాతం రాయితీ, రైస్ కార్డు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు కె.దీనబందు, హుస్సేన్, పిట్ట గురునాథ్, కెవి.రమణ, కె.కుమార్, నమ్మి అప్పలనాయుడు, బి.గురప్ప, కె.పెంటారావు, వెంకటరావు, ఎస్.అప్పారావు, ఎన్‌వి.రమణ, దుర్గారావు, స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమావేశమైన పెన్షనర్ల సంఘం ప్రతినిధులు

మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆటో యూనియన్ సభ్యులు

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం జంక్షన్ వేములవలస పంచాయతీ పరిధిలోని శ్రీలక్ష్మి పైడితల్లమ్మ ఆటో స్టాండ్ ప్రాంగణంలో మజ్జిగ చలివేంద్రాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. సుమారు 3000 మందికి పైగా పంపిణీ చేశారు. ఈ మజ్జిగ చలివేంద్రం ద్వారా ప్రయాణికులకు తమ వంతుగా సాయం అందిస్తున్నామని ఆటో యూనియన్ ప్రెసిడెంట్ పతివాడ నర్సింగరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీలక్ష్మి పైడితల్లమ్మ ఆటో స్టాండ్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరికలు

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 89వ వార్డుకు చెందిన కొంతమంది యువకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే గణబాబు తనయుడు మౌర్యసింహ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మౌర్య సింహ మాట్లాడుతూ, గణబాబు గెలుపుకు కృషిచేయాలని, తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో 89వ వార్డు టిడిపి కార్పొరేటర్ దాడి వెంకట రమేష్, వార్డు అధ్యక్షుడు బుడ్డేటి విజయ్, ఎం.ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

94వ వార్డులో కూటమి ప్రచారం

ప్రజాశక్తి-పెందుర్తి: జివిఎంసి 94వ వార్డు పరిధి పురుషోత్తపురంలో జనసేన, టిడిపి, బిజెపి నాయకులు ఆదివారం ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. కూటమి మేనిఫెస్టోను వివరించారు. అధికారంలోకి రాగానే అంచెలంచెలుగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేట్ బల్ల శ్రీనివాసరావు, జనసేన నాయకులు జగన్మోహన్‌పాత్రుడు, లక్కీ, టిడిపి నాయకులు శ్రీను యాదవ్, మామిడి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని శేరిఖాండంలో ఉన్న షిరిడి సాయిబాబా ధ్యానమందిరం 14వ వార్షికోత్సవాన్ని ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయ ప్రాంగణం వద్ద 2 వేల మందికి అన్నదానం చేశారు. పేదలకు వస్త్రాలు పంపిణీచేశారు. షిరిడి సాయి సేవ ట్రస్ట్ చైర్మన్ సంగు శ్రీనివాసరావు ఆధ్వర్యాన ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

'వెనుకబడిన తరగతులకు ప్రాధాన్యం'

సభలో మాట్లాడుతున్న అమర్‌నాథ్

ప్రజాశక్తి -గాజువాక : వెనుకబడిన తరగతులకు వైసిపి అధిక ప్రాధాన్యం ఇచ్చిందని గాజువాక నియోజవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. బాలచెరువు రోడ్డులోని ఈసేవ గ్రౌండ్‌లో గాజువాక నియోజకవర్గం యాత, శెట్టిబలిజ, గౌడ, శ్రీశయన సంఘం, వైసిపి యువజన సంఘం రాష్ట్ర నాయకులు ఏకుల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యాన ఆదివారం బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ, గీత కులస్తులు ఐక్యంగా ఉండాలన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గీత కులస్తుల్లో ఇద్దరిని రాష్ట్ర మంత్రివర్గంలోకి, ఒకరిని రాజ్యసభకు, ఇద్దరిని శాసనమండలికి పంపి పెద్దపీట వేశారన్నారు. ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా బొత్స ఝాన్సీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల దేవన్‌రెడ్డి, రాష్ట్ర యాత కార్పొరేషన్ డైరెక్టర్ అండిబోయిన లక్ష్మి పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు సన్మానం

ప్రజాశక్తి -ఆనందపురం : పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను వెల్లంకి ది బెస్ట్ అసోసియేషన్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యాన ఆదివారం మెడల్స్, సర్టిఫికెట్లతో సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షులు కంచరపు శ్రీనివాసరావు, సెక్రటరీ జి.సతీష్, సభ్యులు ఆధ్వర్యాన సుమారు 25 మంది విద్యార్థులు వెల్లంకి బొడ్డపాలెం, గారిపేట వెల్లంకి-2లో 10వ తరగతిలో 500 పైబడి మార్కులు సాధించిన విద్యార్థులను, ఇంటర్మీడియట్‌లో 900 మార్కులు పైబడి సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వెల్లంకి ఎంపిటిసి సభ్యులు పడాల అప్పలనాయుడు, శుభ బలరాం సేవా ట్రస్ట్ చైర్మన్ ప్రసాదరావు పట్నాయక్, సొసైటీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మెమోంటోలు, ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

'ఉత్తరం'లో అభివృద్ధి చేశా : కెకె.రాజు

బిల్డర్స్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న బొత్స సత్యనారాయణ కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : గత ఐదేళ్లలో ఉత్తర నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశానని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు చెప్పారు. జివిఎంసి 54వ వార్డు పరిధి 3 స్టార్ వాకర్స్ క్లబ్‌లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరినీ పరిచయం చేసుకుంటూ చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ చల్ల రజిని, నాయకులు ఈశ్వరరావు, చిరంజీవి వాకర్స్ క్లబ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

శంకరమఠం రోడ్డులోని పద్మశాలి భవనంలో పద్మశాలి కులస్తులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత పద్మశాలి కులస్తులకు 20 సెంట్లు స్థలాన్ని కేటాయించేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంపంగి శ్రీనివాసరావు, శైలేష్ పాల్గొన్నారు.

మురళీనగర్‌లోని బొత్స స్క్వేర్ ఫంక్షన్ హాల్‌లో బిల్డర్స్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొత్స సత్యనారాయణ, కెకె.రాజు మాట్లాడారు.

51వ వార్డు పరిధి రాజీవ్‌నగర్‌లో దైవస్వరూపి చర్చిలో కెకె.రాజు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి ఫాథర్ ప్రభుదాసు వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పాల్గొన్నారు.

తాటిచెట్లపాలెం రైల్వే న్యూకాలనీలోని ప్రయివేటు గెస్ట్‌హౌస్‌లో 4 గ్రామ సంఘాల పెద్దలతో నూనెల పోలారావు ఆధ్వర్యాన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వారంతా కెకె.రాజుకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, శ్రీనివాస్, పిఎల్ఎన్.పట్నాయక్, గొంప గోవింద్, దాడి శ్రీను పాల్గొన్నారు.

కంచరపాలెం వర్తక సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వారంతా కెకె.రాజుకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ మార్కండేయులు, ఎస్ సుబ్రహ్మణ్యం, జి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం దుక్కవానిపాలెం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ప్రహరీ పక్కన గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు స్థానిక పోలీసులు తెలిపారు. సుమారుగా 55 నుంచి 60 సంవత్సరాలు వయసుగల వ్యక్తి నెక్ బనియన్, షాట్‌తో చామన ఛాయ రంగు కలిగిన బాడీ లభ్యమైందని పేర్కొన్నారు. మృతదేహం కుళ్ళిపోయి ఉండటంతో మృతిచెంది వారం రోజులుపైనే అయి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. సదరు వ్యక్తి గురించి ఎవరికైనా తెలిస్తే నేరుగా పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

'ఉత్తరం' చర్చిల్లో కాంగ్రెస్ ప్రచారం

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలోని పలు చర్చిల్లో ఇండియా ఫోరం బలపరిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి లక్కరాజు రామారావు ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి గెలిపించాలని క్రిస్టియన్ సోదరసోదరీమణులు కోరారు. రాష్ట్రం, నియోజకవర్గ అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు. నియోజకవర్గంలో ప్రజలు ప్రధానంగా 10 సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

జిమ్స్‌లో నేత్రవైద్యులకు సిఎమ్ఇ

ప్రజాశక్తి-మధురవాడ : నేత్ర చికిత్సా విధానాలలో ముఖ్యంగా గ్లకోమా, కేటరాక్ట్ చికిత్సలో నూతన వైద్య విధానాలపై అవగాహన కలిగించేందుకు గీతం జిమ్స్ ఆసుపత్రి నేత్రవైద్య విభాగం, ఆంధ్రప్రదేశ్ ఆప్తాల్మిక్ సొసైటీ ఆధ్వర్యంలో సిఎమ్ఇ (నిరంతర వైద్య విద్య) కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఉత్తరాంధ్రతో పాటు ఉభయగోదావరి జిల్లాల వరకు గల వైద్య కళాశాలలో పిజి నేత్ర వైద్య విద్యను అభ్యసిస్తున్న, ఆసుపత్రులలో పనిచేస్తున్న 250 మందికి పైగా వైద్య విద్యార్థులు, వైద్యులకు సీనియర్ నైత్ర వైద్య నిపుణులు గ్లకోమా కేటరాక్ట్ చికిత్సలో నూతన వైద్య విధానాలపై అవగాహన కల్పించారు.

ముఖ్య అతిథిగా హాజరైన జిమ్స్ ఆసుపత్రి డీన్ డాక్టర్ ఎస్‌పి.రావు మాట్లాడుతూ, నేత్రవైద్యంలో గ్లకోమా, కేటరాక్ట్ వంటి వివిధ ప్రత్యేక చికిత్సలు రావడంతో సూపర్ స్పెషాలిటీగా వృద్ధిచెందిందని పేర్కొన్నారు. ప్రజలలో 25 శాతం అంధత్వ సమస్య కేటరాక్ట్ ద్వారానే అని గుర్తించినప్పటికీ అధికశాతం మంది చికిత్సకు దూరంగా ఉంటున్నారని, దీనికి సరిపడా నేత్ర వైద్య నిపుణులు లేక పోవడమే కారణమన్నారు. వైద్యరంగంలో డిజిటల్, ఎలక్ట్రానిక్ పరికరాలు చికిత్సకు వాడుతున్న నేపథ్యంలో ఇంజినీరింగ్, మెడికల్, సైన్స్ విభాగాల నిపుణులు సమన్వయంతో పనిచేసి నూతన పరికరాల తయారీపై అధ్యయనం చేయాలన్నారు. ఇలాంటి అధ్యయనాలకోసం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మూర్తి ప్రయోగ శాలలు నెలకొల్పిందని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ ఆప్తాల్మిక్ సొసైటీ అధ్యక్షుడు, జిమ్స్ నేత్రవైద్య విభాగం అధిపతి డాక్టర్ వివిఎల్.నరసింహారావు మాట్లాడుతూ, అఖిలభారత నేత్ర వైద్యుల సంఘానికి అనుబంధంగా పనిచేస్తున్న తమ సొసైటీలో ఆంధ్రప్రదేశ్ లోని 1500మంది నేత్రవైద్యులు సభ్యులుగా ఉన్నారని తెలిపారు. అకడమిక్ రీసెర్చ్ కమిటీ పర్యవేక్షణలో తమ సభ్యులకు నిరంతర వైద్య విద్యా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పిజి వైద్య విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకోవడానికి, సీనియర్ వైద్యుల అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోవడాని సిఎమ్ఇ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆప్తాల్మిక్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ డాక్టర్ సివి.గోపాలరాజు, నిర్వాహక కార్యదర్శి డాక్టర్ కెవివి.సత్యరాయణ, సైంటిఫిక్ కమిటీ చైర్మన్ డాక్టర్ మధు ఉద్ధరాజు, డాక్టర్ జిఆర్.రెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ పరిశీలకుడు డాక్టర్ పద్మరాజు హాజరై దిశానిర్దేశం చేశారు.

సిఎమ్ఇని ప్రారంభిస్తున్న జిమ్స్ ప్రతినిధులు

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖ, అనకాపల్లి
సోమవారం
6 మే 2024

కలం మాట

ఓటే మీ ఆయుధం!

తాత్కాలిక లాభానికి ఆశపడవద్దు
ప్రలోభాలకు ఎవ్వరూ లొంగిపోవద్దు

నేటి మీ ఓటు నిర్ణయించు
రేపటి మీ భవిత, భద్రతలు
ఓటు ఒక అవకాశం
ఓటే మీ అయుధం

అభిమానధనులైన
ఓ ఓటరు మహాశయులారా
ఎన్నికల వేళ
ఎన్నో చిత్రవిచిత్రాలు జరగొచ్చు

నిజ జీవితంలో గొప్పగా నటించే
మహానటులు నేటి మన నాయకులు

అసాధ్యమైన హామీలు ఇవ్వవచ్చు
మత్తు లోకంలో మిమ్మల్ని ముంచెయ్యవచ్చు
ఉచిత పథకాలేన్నో ప్రకటించనూ వచ్చు
ధన పంపిణీ దర్జాగా చెయ్యనూవచ్చు

ఓటుహక్కును ఉపయోగించండి
మంచి నాయకున్ని ఎన్నుకోండి
ఓటు ఆయుధం వినియోగించండి
విజ్ఞతతో మీరు వేసే ఈ ఓటు
భావితరానికి సుపరిపాలన అందిస్తుంది

ఓటుహక్కును అందరూ
వినియోగించుకోవలె
నిస్వార్థపరులైన నాయకులనే ఎన్నుకోవలె

- కింతలి సన్యాసిరావు
విశాఖపట్నం, మొబైల్ : 99085 35185

ఇండియా బ్లాక్ భారీ బైక్ ర్యాలీ

ర్యాలీ చేస్తున్న కాంగ్రెస్ వామపక్ష కార్యకర్తలు

ప్రజాశక్తి -చోడవరం : ఇండియా బ్లాక్ బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ చోడవరం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి జగతా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. చోడవరం నుంచి కొత్తకోట వరకు సాగిన ర్యాలీలో అనకాపల్లి ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి వేగి వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశంలోనూ, రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా ఫోరం అధికారంలోకి వస్తే, ప్రభుత్వరంగాన్ని పరిరక్షించడంతోపాటు ఎపికి ప్రత్యేకహోదా తెస్తామన్నారు. ర్యాలీలో సిపిఎం నాయకులు ఎస్ నాయుడు. కాంగ్రెస్ నాయకులు ఎస్.నూకరాజు, సయ్యపురెడ్డి సత్యనారాయణ, పులిగా వెంకటరమణ పాల్గొన్నారు

సార్వత్రిక సంగ్రామం

ఓటర్ల వివరాలు..
మొత్తం : 2,04,073
పురుషులు : 99,340
మహిళలు : 1,04,724
ఇతరులు : 9

యలమంచిలి మెయిన్‌రోడ్డు

అభివృద్ధి కంటే ... సమస్యలే అధికం.!

- సెజ్ పరిశ్రమల కాలుష్యంతో జనం సతమతం
- ఆధునికీకరణకు దూరంగా పర్యాటక ప్రాంతాలు
- సమస్యల్ని ఎన్నికల ఎజెండాలో ప్రస్తావించని ప్రధాన పార్టీలు

పర్యాటకంగా, పారిశ్రామికంగా పురోభివృద్ధి చెందుతున్న యలమంచిలిలో, అభివృద్ధి కంటే సమస్యలే శరవేగంగా దౌడు తీస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. సెజ్‌లో పరిశ్రమల ఏర్పాటుతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలిగినా, అంతకంటే కాలుష్యం, పర్యావరణ సమస్యలు ప్రజలను ముంచెత్తుతున్నాయి. పూడిమడక తీరంతోపాటు కొండకర్ల ఆవ, పంచదార్ల కొండలు, పెంజెరువు, కొండయ్యగుండం వంటి సహజసిద్ధమైన పర్యాటక, చారిత్రక ప్రదేశాలు సమస్యలతో కూనరిల్లుతున్నాయి. జనరల్ అభ్యర్థులకు కేటాయించిన అసెంబ్లీ స్థానం కావడంతో రాజకీయచైతన్యమున్నప్పటికీ, ప్రజా ప్రయోజనం, నియోజకవర్గ అభివృద్ధి కంటే వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాలకే నేతలు ప్రాధాన్యతనిస్తున్నారనే విమర్శలున్నాయి.

(ప్రజాశక్తి- యలమంచిలి)

స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత తొలినాళ్లలో ఏర్పాటైన నియోజకవర్గాల్లో యలమంచిలి ఒకటి.. కొండకర్ల పేరుతో ఉన్న నియోజకవర్గం, 1952లో సమితిగా ఉన్న యలమంచిలిగా పేరు మారింది. మండల వ్యవస్థ ఆవిర్భావం తర్వాత యలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం మండలాలు పూర్తిగాను, ఎస్.రాయవరం, మునగపాక మండలాల్లోని కొంతభాగం ఎలమంచిలి నియోజకవర్గంలో ఉండేవి. 2009 నియోజకవర్గాల పునర్విభజనలో ఎలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురంతోపాటు మునగపాక మండలం పూర్తిగా యలమంచిలిలో పూర్తిగా విలీనం చేయగా, కలిసిపోగా, ఎస్.రాయవరంలోని కొంతభాగం పాయకరావుపేటలోకి కలిపేశారు.

1952లో ఏర్పాటై, జనరల్‌కు రిజర్వ్ చేసిన ఎలమంచిలి నియోజకవర్గంలో తొలిఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఎ.సూర్యనారాయణమూర్తిపై కృషికార్ పార్టీ అభ్యర్థి పప్పల బాపునాయుడు గెలిచారు. 1955లో సిపిఐ అభ్యర్థి కాండ్రేగుల రామజోగిపై స్వతంత్ర్య అభ్యర్థి సిహెచ్‌విఎస్.రాజు, 1962లో సిపిఐ అభ్యర్థి వెలగా వీరభద్రరావుపై కాంగ్రెస్ అభ్యర్థి వీసం సన్యాసినాయుడు, 1967, 72ల్లో కాంగ్రెస్ అభ్యర్థి వీసం సన్యాసినాయుడుపై నగిరెడ్డి సత్యనారాయణ, కెకెవిఎస్.రాజులు స్వతంత్ర్య అభ్యర్థులుగా గెలిచారు. 1978లో జెఎస్‌పి అభ్యర్థి నగిరెడ్డిసత్యనారాయణపై కెకెవిఎస్ రాజు ఇండిపెండెంట్‌గా విజయం సాధించారు.

టిడిపికి కంచుకోటగా...

1983లో టిడిపి ఆవిర్భావం తర్వాత వరుసగా జరిగిన ఐదు ఎన్నికల్లోనూ ఆపార్టీ అభ్యర్థులే విజయం సాధించడంతో టిడిపికి కంచుకోటగా మారింది. 1983లో కాంగ్రెస్ అభ్యర్థి వీసం సన్యాసినాయుడుపై టిడిపి అభ్యర్థి కెకెవిఎస్ రాజు విజయం సాధించారు. 1985 నుంచి1999 వరకు వరుసగా నాలుగు ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా పప్పల చలపతిరావు విజయఢంకా మోగించారు. కాంగ్రెస్ ప్రత్యర్థులు వీసం సన్యాసినాయుడు, నగిరెడ్డి ప్రభాకరరావు, యువి.రమణమూర్తిరాజుపై పప్పల జయకేతనం ఎగరేశారు.2004లో టిడిపి అప్రతిహత విజయాలకు బ్రేక్ పడింది. వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన పప్పల చలపతిరావును అనకాపల్లి ఎంపీ స్థానానికి పోటీకి దింపిన టిడిపి అధిష్టానం, గొంతిన నాగేశ్వరరావును ఎమ్మెల్యేగా పోటీ చేయించగా, అతనిపై కాంగ్రెస్ అభ్యర్థి కన్నబాబురాజు గెలుపొందారు. విశేషమేంటంటే ఎంపీగా పోటీకిదిగిన పప్పల చలపతిరావు గెలుపొందినప్పటికీ, ఎలమంచిలి అసెంబ్లీ స్థానంలో టిడిపి ఓడిపోయింది. 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా, 2019లో వైసిపి అభ్యర్థిగా కన్నబాబురాజు విజయం సాధించగా, 2014లో టిడిపి అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు విజయం సాధించారు.

అభివృద్ధి మాటున పెరిగిన సమస్యలే అధికం

నియోజకవర్గంలో ప్రధాన మార్పు గురించి చెప్పుకుంటే... మేజరు పంచాయతీగా ఉన్న యలమంచిలిలో ఏడు గ్రామాలను విలీనం చేసి నగర పంచాయతీగా మార్పుచేశారు. అలాగే అచ్యుతాపురం, రాంబిల్లిలలో సెజ్‌ల ఏర్పాటుతో పారిశ్రామికంగా పురోభివృద్ధి కనిపించింది. సెజ్‌ల్లో పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి, ఉద్యోగావకాశాలు కాస్త మెరుగైనప్పటికీ, అంతకంటే తీవ్రస్థాయిలో పర్యావరణ సమస్యలు ఉత్పన్నమయ్యాయి. సెజ్ కంపెనీల్లోని పారిశ్రామిక వ్యర్థాలను విరివిగా సముద్ర జలాల్లోకి వదిలేస్తుండడంతో మత్ససంపద క్షీణిస్తోందని పూడిమడక, రాంబిల్లి పరిసరాల్లోని మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు. అంతేకాక వాయు, భూగర్భ జలాల కాలుష్యంతో అనారోగ్యం సమస్యలు అధికమయ్యాయి. పరిశ్రమల కోసం సేకరించిన భూములకు పరిహారం చెల్లించడంలోను, నిర్వాసితులకు న్యాయం చేయడంలోనూ వైఫల్యం కొనసాగుతోంది.

సహజ వనరుల అభివృద్ధి, పరిరక్షణలో విఫలం

అచ్యుతాపురం మండలం కొండకర్ల ఆవ, రాంబిల్లి మండలం పంచదార్ల కొండలులాంటి సహజసిద్ధ సౌందర్యాన్ని అభివృద్ధి చేయకపోగా, వాటి పరిరక్షణలో నేతల నిర్లక్ష్యం, వైఫల్యం ఉంది. కొండకర్ల ఆవ ఆక్రమణలకు గురైంది. ఆవను సుందరీకరించి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్న ప్రజల ఆకాంక్ష హామీలకే పరిమితమై, నేటికీ కలగానే మిగిలి పోయింది. ఆకర్షనీయమైన పూడిమడక తీరాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్ది, మత్స్యకారుల వేటకు జెట్టీ నిర్మించాలన్న ప్రతిపాదన కాగితాలను దాటి ముందుకు రావడంలేదు. రాంబిల్లి మండలం ఉప్పటేరు ప్రాంతంలోని ఆక్రమణలు తొలగించి, ముంపు సమస్య నుంచి విముక్తి కల్పించాలన్న ప్రజల గోడు సముద్రఘోషలోనే కలిసిపోయింది. యలమంచిలిలో పెంజెరువు, కొమ్మయ్యగుండం సుందరీకరణ జరగకపోగా, త్రినాథకోవెల సమీపంలోని చెరువు మరమ్మతు పనులు ఏళ్లు గడుస్తున్నా కొలిక్కి రాని దుస్థితి. గ్రావెల్ దందా యథేచ్ఛగా జరుగుతోంది. గ్రామాలకు వెళ్లే రోడ్లతో పాటు, మున్సిపాలిటీలోని అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి.ఇలా పలు సమస్యలన్నీ పరిష్కారానికి నోచుకోకుండా, ఎన్నికల్లో నేతలకు ఓట్లు తెచ్చే అంశాలుగా మిగిలిపోతున్నాయనే విమర్శలూ ఉన్నాయి.

తాజా ఎన్నికల్లో

ఎలమంచిలి నియోజకవర్గానికి ఇప్పటివరకు 15 ఎన్నికలు జరగ్గా, ఈనెల 13న 16వ విడత ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా సిటింగ్ ఎమ్మెల్యే కన్నబాబురాజు మళ్లీ పోటీచేస్తుండగా, టిడిపి,బిజెపి, జనసేన కూటమి తరపున జనసేన అభ్యర్థిగా సుందరపు విజయకుమార్ పోటీలో నిలిచారు. ఇండియా ఫోరం బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థిగా తనకాల నర్సింగరావు పోటీలో న్నారు.ప్రధానపార్టీల అభ్యర్థులు ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని, చావోరేవో అన్నఉగ్గా ప్రచారం చేస్తున్నాయి. ఓటర్లు ఎవరికి పట్టం కడతారో వేచిచూడాలి.

సుందరపు విజయకుమార్ (జనసేన)

తనకాల నర్సింగరావు (కాంగ్రెస్)

యువి.కన్నబాబురాజు (వైసిపి)

ఎలమంచిలి ఎమ్మెల్యేలు వీరే...

1952 : పప్పల బాపునాయుడు (కృషికార్ లోక్‌పార్టీ)
1955 : చింతలపాటి వి.ఎస్.రాజు (ఇండిపెండెంట్)
1962 : వీసం సన్యాసినాయుడు (కాంగ్రెస్)
1967 : నగిరెడ్డి సత్యనారాయణ (ఇండిపెండెంట్)
1972 : కె.కె.వి.ఎస్.రాజు (ఇండిపెండెంట్)
1978 : వీసం సన్యాసినాయుడు (కాంగ్రెస్)
1983 : కెకెవిఎస్ రాజు (తెలుగుదేశం)
1985 : పప్పల చలపతిరావు (తెలుగుదేశం)
1989 : పప్పల చలపతిరావు (తెలుగుదేశం)
1994 : పప్పల చలపతిరావు (తెలుగుదేశం)
1999 : పప్పల చలపతిరావు (తెలుగుదేశం)
2004 : యు.వి.రమణమూర్తిరాజు (కాంగ్రెస్)
2009 : యు.వి.రమణమూర్తిరాజు (కాంగ్రెస్)
2014 : పంచకర్ల రమేశ్‌బాబు (తెలుగుదేశం)
2019 : యువి.రమణమూర్తిరాజు (వైసీపీ)

జగనన్నా.. ఏదీ సంపూర్ణ మద్యనిషేధం

- ఎన్నికల ప్రచారంలో సిపిఐ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి అత్తిలి విమల

ఎన్నికల ప్రచారంలో ఇండియా బ్లాక్ పార్టీ శ్రేణులతో సిపిఐ ఎమ్మెల్యే అభ్యర్థి విమల

ప్రజాశక్తి -గోపాలపట్నం : అధికారంలోకి రాగానే దశలవారీగా మద్యనిషేధం అమలు చేసిన తర్వాతే 2024లో ఓట్లు అడుగుతానని చెప్పిన వాగ్దానం ఏమైంది జగనన్న..? అంటూ ఇండియా ఫోరం బలపరిచిన సిపిఐ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి అత్తిలి విమల ప్రశ్నించారు. పోలింగ్ సమీపిస్తున్న తరుణంలో నియోజకవర్గంలో ప్రచార జోరు పెంచారు. ఆదివారం కాకరలోవ, చింతలకోన, క్రాంతినగర్, త్రినాథపురం, దుర్గానగర్,గుడివాడ అప్పన్న కాలనీ తదితర ప్రాంతాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి చేసిన ద్రోహం, విభజన హామీల అమలులో వైఫల్యం, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ వంటి అంశాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. ప్రభుత్వరంగ పరిరక్షణ, కార్మికులకు ఉద్యోగ భద్రత వంటి అంశాలను వివరిస్తూ ప్రజలను చైతన్యవంతం చేస్తూ ప్రచారం కొనసాగించారు. కార్యక్రమంలో గాజువాక సిపిఎం ఎమ్మెల్యే ఎం జగ్గునాయుడు, సిపిఎం జోన్ కార్యదర్శి పి పైడిరాజు, కాంగ్రెస్ నాయకులు పి నూకరాజు, రజియా బేగం, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు, కార్యవర్గ సభ్యులు కె సత్యంజనేయ,జి రాంబాబు పాల్గొన్నారు.

చర్చిల్లో వాసుపల్లి ఎన్నికల ప్రచారం

చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న వైసిపి దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వైసిపి దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ ఆదివారం పలుచర్చిల్లో ప్రార్థనల్లో పాల్గొని, ప్రచారం చేశారు. చర్చి ఫాదర్‌లు ఆశీస్సులు అందుకున్నారు. జగదాంబ జంక్షన్ ట్రినిటీ లూథరన్ చర్చిలో రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ చైర్మన్ జాన్ వెస్లీ, జెసిఎస్ మండల అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్, వైసిపి నేత బొడ్డేటి ప్రసాద్‌తో పార్థనల్లో పాల్గొనగా, చర్చి ఫాదర్స్ వాసుపల్లికి విజయం చేకూరాలని ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం 36 వార్డు వైసిపి నేత డేవిడ్ రాజు పిలుపు మేరకు ఎవిఎన్ కళాశాల దరి చర్చికి వెళ్లి క్రైస్తవ సోదరులను కలిసి ప్రచారం చేశారు. క్రిస్టియన్, మైనారిటీలకు సముచిత స్థానం కల్పించిన సిఎం జగన్మోహనరెడ్డిని మరోసారి సిఎంగా గెలిపించాలని, దక్షిణ ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీలకు ఫ్యాన్ గుర్తుపై ఓటేయాలని కోరారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి, పక్కనే ఎంపీ అభ్యర్థి ఝాన్సీ

రాజీవ్ గృహకల్పలో వైసిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి ఐదోవార్డు రాజీవ్ గృహకల్ప కాలనీలో ఆదివారం విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీతో కలిసి భీమిలి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రచారం నిర్వహించారు. భారీ ఎత్తున వైసిపి శ్రేణులు బైక్ ర్యాలీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ, వచ్చే ఎన్నికల్లో వైసిపి తరపున ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనకు, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీకి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు.

వైసిపిలో చేరికలు

భీమునిపట్నం: భీమిలి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సమక్షంలో పద్మనాభం మండలం, తునివలస, అనంతవరం గ్రామాలకు చెందిన పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆదివారం వైసిపి లో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వారికికండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.వైసిపిలో చేరిన వారిలో తునివలస టిడిపి నాయకులు అల్లు అప్పలరాజు, నలుగురు వార్డు సభ్యులు, అనంతవరానికి చెందిన కశి రెడ్డి సురేష్, సబ్బవరపు రామారావు ఉన్నారు. కార్యక్రమంలో జెడ్‌పి వైస్‌చైర్మన్ ఎస్ గిరిబాబు, ఎంపిపి కె రాంబాబు పాల్గొన్నారు

వైసిపి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ముత్తంశెట్టి

బీచ్‌లో వాకర్స్‌తో వెలగపూడి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: 20, 21వ వార్డు పార్క్ హోటల్ నుంచి ఆర్‌కె. బీచ్ పరిసర ప్రాంతాలో వాకర్స్ పార్కులలో వాకర్స్, సీనియర్ సిటిజెన్సును టిడిపి తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు మార్నింగ్ వాక్ చేశారు. 13న జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లేసి తూర్పు ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా శ్రీభరత్‌ను గెలిపించాలని అభ్యర్థించారు.

పెద్దజాలారిపేటలో..

19వ వార్డు పెద్దజాలారిపేట ఎన్‌టిఆర్ విగ్రహం డౌన్ రోడ్డు ప్రాంతంలో కార్పొరేటర్ నొల్లి నూకరత్నం ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారసభలో టిడిపి తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు పాల్గొన్నారు. రాజుల పేరు చెప్పి రూ.2500 కోట్ల విలువైన పెదజాలారిపేట భూములను దొడ్డిదారిన వైసిపి నేతలు దోచేసుకున్నారన్నారు. మోసపూరిత హామీలతో మళ్లీ అధికారంలోకి రావాలన్న వైసిపికి గుణపాఠం చెప్పాలని, టిడిపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. నాయకులు బైరెడ్డి పోతనరెడ్డి రాజు వార్డు అధ్యక్షులు చిరంజీవి పాల్గొన్నారు.

వెలగపూడి సతీమణి ఇంటింటా ప్రచారం

కూటమి బలపరిచిన టిడిపి తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి వెలగపూడి రామకృష్ణ బాబును మళ్లీ గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి సుజన ఎంవిపి కాలనీ సెక్టార్ 11, సహా పలు ప్రాంతాల్లో గడపగడపకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టిడిపి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల వివరాలతో కూడిన కరపత్రాల్ని ఓటర్లకు పంచిపెడుతూ, కూటమి గెలుపు అవసరాన్ని వివరిస్తూ ప్రచారం కొనసాగింఆచరు.కార్యక్రమంలో కూటమి కార్యకర్తలు, మహిళలు నేతలు ఎమ్మెల్యే సతీమణి కుటుంబ సభ్యులతో పద్మజ, సీత, మాధురి, శ్రీలక్ష్మి, సబిత, సరోజ, రాధిక, సుమా, పీతల అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌లో వాకింగ్ చేస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వెలగపూడి

ప్రచారం చేస్తున్న భరత్‌కుమార్, ఎంపీ సత్యవతి తదితరులు

వైసిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి- అనకాపల్లి : జివిఎంసి 83, 84వ వార్డుల్లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, స్థానిక ఎంపీ డాక్టర్ బివి సత్యవతితో కలిసి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గొల్ల వీధి, కరణాల వీధి, బొగ్గరపు వీధి ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి ఆ వార్డుల ఇన్‌ఛార్జులు జాజుల రమేష్, కోరుకొండ రాఘవ, నాయకులు మందపాటి జానకిరామరాజు, డాక్టర్ రామ్మూర్తి, అప్పికొండ రవిశంకర్, కోరుకొండ అప్పల సూరి, కోరుకొండ మునిస్వామి, గాడి మాదురినాయుడు, యల్లపు గోవిందు, యండ్ర శ్రీనివాసరావు, బాబు హరినాథ్ పాల్గొన్నారు. జాజుల రమేష్ ఆధ్వర్యంలో టిడిపి, జనసేన పార్టీలకు చెందిన మిర్యాల కాలనీ, భీమునిగుమ్మం అరుంధతి సేవా సంఘం సభ్యులు సుమారు 100 మంది వైసీపీ చేరారు.

అచ్యుతాపురం : ఎలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థి కన్నబాబురాజు మండలంలోని మార్యూరు, ఎస్‌ఈజెడ్ గ్రామాలలో ఆదివారం భారీ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రొంగలి జగన్నాథం, జడ్పిటిసి సభ్యుడు లాలం రాంబాబు, గ్రామ సర్పంచ్ కేకే రమేష్ బాబు, కేవీ రమణ, చేకూరి శ్రీనివాసరాజు, కేకే శ్రీను రాజు, కోన బుజ్జి, దేశం శెట్టి శంకర్రావు పాల్గొన్నారు.

చౌడువాడలో ఉద్రిక్తత

- వైసిపి వాహనాలను అడ్డుకున్న టిడిపి, జనసేన శ్రేణులు
- గ్రామంలో పోలీసు పికెట్

టిడిపి, జనసేన కార్యకర్తలను సముదాయిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-కె.కోటపాడు

వైసిపి ప్రచార వాహనాలను మండలంలోని చౌడువాడ గ్రామంలోకి రాకుండా టిడిపి, జనసేన పార్టీలకు చెందిన వారు ఆదివారం ఉదయం అడ్డుకోవడంతో ఆ గ్రామంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. మండలంలోని మేజర్ పంచాయతీ చౌడువాడలో ఆదివారం వైసిపి ఎన్నికల ప్రచార ర్యాలీకి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం తెల్లవారుజామునే నాలుగు ప్రచార వాహనాలు గ్రామంలోకి వస్తుండగా టిడిపి, జనసేన కార్యకర్తలు అడ్డుకున్నారు. వైసిపి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు స్వగ్రామం దేవరాపల్లి మండలం తారువ గ్రామంలో శనివారం చోటుచేసుకున్న వివాదం సందర్భంగా చౌడువాడ గ్రామానికి చెందిన బిజెపి కార్యకర్త కుమార అప్పారావును కొట్టారని, గ్రామ సర్పంచ్ దాడి ఎరుకు నాయుడు కారు అద్దాలు ధ్వంసమయ్యాయని ఆరోపిస్తూ ఆదివారం చౌడువాడలో వైసీపీ చేపట్టిన ర్యాలీని భగ్నం చేశారు. వైసిపి ప్రచార వాహనాలను అడ్డుకోవడంతో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పెద్ద ఎత్తున సిఆర్పిఎఫ్ దళాలు గ్రామానికి చేరుకున్నాయి. అనకాపల్లి డిఎస్పి అప్పలరాజు, చోడవరం, కె.కోటపాడు సిఐలు శ్రీనివాసరావు, స్వామినాయుడు టిడిపి, జనసేన కార్యకర్తలకు ఎంత నచ్చజెప్పినా గ్రామంలోకి వాహనాలు రావడానికి వీలులేదని భీష్మించుకు కూర్చున్నారు. ఒక దశలో లాఠీచార్జి చేసినా వెనక్కి తగ్గలేదు. గ్రామానికి చెందిన వైసిపి నాయకులు దాట్ల శివాజీ రాజు, రాజేష్, రొంగలి సూర్యనారాయణ ప్రచార వాహనాలను గ్రామంలోకి తీసుకురావడానికి ప్రయత్నించినా వారు ప్రతిఘటించారు. దీంతో పోలీసులు వైసీపీ వాహనాలను వెనక్కి పంపించివేశారు. తమ గ్రామానికి చెందిన కుమార అప్పారావును అకారణంగా కొట్టడంతో బూడి ముత్యాల నాయుడు ప్రచార వాహనాలను గ్రామంలోకి అడుగుపెట్టనివ్వలేదని సర్పంచ్ ఎరుకునాయుడు తెలిపారు. పోలీసులు మాత్రం ఏ పార్టీకి చెందిన వాహనాలైనా చౌడువాడలోకి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. ఎన్నికలు అయ్యేంతవరకు చౌడువాడ గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేయడం జరుగుతుందని అధికారులు తెలిపారు.

కూటమి అభ్యర్థుల ప్రచారం

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మండలంలోని ఎస్ఈజెడ్, దిబ్బపాలెం, చీమలపల్లి, మడుతూరు తదితర గ్రామాలలో ఆదివారం కూటమి ఎమ్మెల్యే ఎంపీ అభ్యర్థులు సుందరపు విజయ్ కుమార్, సీఎం రమేష్ ప్రచారం చేశారు. గ్రామాలలో ర్యాలీగా తిరిగారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, కూటమి నాయకులు ప్రగడ నాగేశ్వరరావు, లాలం భవాని భాస్కర్, రాజాన రమేష్ కుమార్, బి రామదాసు, జనపరెడ్డి శ్రీనివాసరావు, సుందరపు సత్యనారాయణ, అడిగర్ల దేవుడు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన వైసిపి కార్యకర్తలు

చీమలపల్లి గ్రామంలోని వైసీపీకి చెందిన జనపాల నూకరాజు, వారిపల్లి శేషు పెయ్యిల సత్యవతి అప్పారావు దంపతులు, జనపాల, కంఠంరెడ్డి, పారిపల్లి, పెయ్యిల కుటుంబాలు ఆదివారం జనసేన ఎలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరారు. జనసేన నేత ఎం శ్రీవేణి ఆధ్వర్యంలో మడుతురు గ్రామస్తులు జనసేన పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బి రాందాసు పాల్గొన్నారు.

పరవాడ మండలంలో...

పరవాడ : మండల కేంద్రం పరవాడల శనివారం రాత్రి గ్రామ సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు ఆధ్వర్యంలో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం చేశారు. మండలంలోని తానాంలో సర్పంచ్ కన్నూరు దేవి వెంకట రమణ ఆదివారం ప్రచారం నిర్వహించారు. మండలంలోని ముత్యాలమ్మపాలెం గ్రామంలో సర్పంచ్ చింతకాయల సూజాత ముత్యాలు ఆధ్వర్యంలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటీసి చింతకాయల అమ్మోరు, నాయకులు మైలపల్లి అప్పన్న సూరాడ ముత్యాలరావు, అర్జిల్లి తాతారావు ఇతర నాయకులు పాల్గొన్నారు.

జబర్దస్త్ ఆర్టిస్టుల ప్రచారం

ప్రజాశక్తి-అనకాపల్లి : జివిఎంసి 81వ డివిజన్, పాత 15వ వార్డు దేమునిగుమ్మం, గోలివీధి, వెంకటేశ్వర స్వామి టెంపుల్ రోడ్ ప్రాంతాల్లో కూటమి అభ్యర్థులు కొణతాల రామకృష్ణ, రమేష్ విజయాన్ని ఆకాంక్షిస్తూ జబర్దస్త్ ఆర్టిస్టులు షకలక శంకర్, రాపేట అప్పారావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మల్ల సురేంద్ర, బొలిశెట్టి శ్రీనివాసరావు, శ్రీరామదాసు గోవింద్, మారిశెట్టి శంకర్రావు, ఎస్ఎఫ్ఐ సత్యనారాయణ, సకల గోవింద పాల్గొన్నారు. స్థానిక వేల్పుల వీధి, తుమ్మపాలలో కూటమి నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నాగ జగదీష్, మాజీ ఎమ్మెల్యే గోవింద సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రచారంలో పాల్గొన్న జబర్దస్త్ ఆర్టిస్టులు షకలక శంకర్, అప్పారావు

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలి

జోరుగా కాంగ్రెస్ అభ్యర్థుల ప్రచారం

ఓట్లు అభ్యర్థిస్తున్న కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ నాయకులు

ప్రజాశక్తి-మునగపాక

సిపిఎం, సిపిఐ, ఆమ్ ఆద్మీ (ఇండియా వేదిక) పార్టీలు బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఆదివారం ఇండియా వేదిక నాయకులు జిల్లాలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా యలమంచిలి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి తనకాల అనంతరావు ఆదివారం మండలంలోని పలు గ్రామాలలో ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ మేనిఫెస్టో వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ప్రజాసంక్షేమం కాంగ్రెస్ తోనే సాధ్యమని తెలిపారు. పాలక వైసీపీ, ప్రతిపక్ష తెలుగు దేశం, జనసేన పార్టీలు ప్రజా సమస్యలను గాలికి వదిలేశాయని, కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి ఊడిగం చేయడానికి పోటీపడుతున్నారని విమర్శించారు. రాష్ట్రానికి రావలసిన ప్రత్యేక హోదా, రైల్వే జోన్, పోలవరం ప్రాజెక్టు, విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ తదితర అంశాలపై నోరు ఎత్తకపోవడం విచారకరమన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కర్రి అప్పారావు, కాండ్రేగుల సదాశివరావు, బుద్ధ రంగారావు, ఎస్ బ్రహ్మాజీ, సిపిఐ జిల్లా నాయకులు పెంటకోట సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు చోడిపల్లి సుభద్రరావు, ఎంవిఆర్.రాహుల్, పొలమరశెట్టి శెట్టి ఆదిమూర్తి, యల్లపు రాము పాల్గొన్నారు.

అచ్యుతాపురం : కాంగ్రెస్ పార్టీ ఎలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థి తనకాల అనంతరావు, ఎంపీ అభ్యర్థి వేగి వెంకటేశ్వరరావులకు మద్దతుగా ఆదివారం ఎలమంచిలి నియోజకవర్గంలో సిపిఎం నాయకులు కర్రి అప్పారావు, కె.రామ సదాశివరావు ఎస్ బ్రహ్మాజీ, ఎమ్మెల్యే అభ్యర్థి తనకాల అనంతరావు ఎన్నికల ప్రచారం చేశారు. రాంబల్లి అచ్యుతాపురం మండలాల పరిధిలో గ్రామాలలో ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు హస్తం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంవిఆర్ రాహుల్, బీశెట్టి పెంటారావు, ఎల్లపు రాము, భీశెట్టి మోహన్ మహిళలు పాల్గొన్నారు.

అనకాపల్లి : కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఐఆర్.గంగాధర్, ఎంపీ అభ్యర్థి వేగి వెంకటేష్‌లను గెలిపించాలని కోరుతూ ఆదివారం అనకాపల్లి మండలం తగరంపూడి గ్రామంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి యగ్గాడ భాస్కర్‌రావు ఆధ్వర్యాన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఇటు రాష్ట్రంలోనూ, అటు కేంద్రంలోనూ కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ప్రజలను కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎపిఎకి ప్రత్యేక హోదా ఇస్తుందన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

FORMAT C-1
(For candidate to publish in Newspapers, TV)
DECLARATION ABOUT CRIMINAL CASES
(As per the judgment dated 25" September, 2018, of Honourable Supreme Court in WP (Civil) No.536 of 2011(Public Interest Foundation & Ors.Vs.Union of India & Anr.)

Name and address of candidate : **VEGI VENKATESH**, S/o. Baburao, R/o. D.No.50-52-4/2, GVMC 9th Ward, Visakhapatnam, Visakhapatnam District.
Name of political party : **INDIAN NATIONAL CONGRESS (INC)**
(Independent candidates shouldwrite "Independent" here)
Name of Election : **PARLIAMENTARY ELECTIONS - 2024**
Name of Constituency : **05 – ANAKAPALLE PARLIAMENTARY CONSTITUENCY**

I, **VEGI VENKATESH,** (nameofcandidate), acandidate for the above mentionedelection, declare for publicinformationthe following details about my criminal antecedents:

(A) Pending Criminal Cases:

Sl. No.	Name of Court	Case No. And Dated	Status of Cases (s)	Section(s) of Acts concerned and brief description of offence(s)
1.	Not Appli cable	Cr No. 255/ 2023 pending with Anakapalle Town Police Station	Under section 324, 323 r/w 34 of IPC	For alleged offences which is pending investigation as per the information given by SHO of Anakapalle Town Police Station and same is disclosed as an abundant caution

(B) Details about cases of conviction for criminal offences.

Sl No	Name of Court & date(s)of order(s)	Description of offence(s) & Punishment imposed	Maximum Punishment Imposed
1	Not Applicable	Not Applicable	Not Applicable

In the case of election to Council of States or election to Legislative Council by MLAs, mention the election concern edinplace of name of constituency.

sd/- VEGI VENKATESH,
05 – ANAKAPALLE PARLIAMENTARY CONSTITUENCY

ప్రజాశక్తి సీనియర్ పాత్రికేయులు అప్పారావు మృతి

అప్పారావు పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు
(ఇన్‌సెట్‌లో అప్పారావు ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి – నర్సీపట్నం టౌన్ : ప్రజాశక్తి నర్సీపట్నం సీనియర్ పాత్రికేయులు వడ్లమూరి అప్పారావు (51) అనారోగ్యంతో ఆదివారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో మృతిచెందారు. ఆయన మృతి పలువురిని కలిచివేసింది. అప్పారావు విద్యార్థి దశలోనే ఎస్ఎఫ్ఐ నాయకునిగా విద్యార్థుల సమస్యలపై పోరాడారు. యువజన సంఘంలోనూ పనిచేశారు. అనంతరం ప్రజాశక్తిలో విలేకరిగా చేరి సుమారు 25 ఏళ్లకు పైగా సేవలందించారు. పత్రికకు నర్సీపట్నంలో బ్రాండ్ ఇమేజ్ తీసుకొచ్చారు. ఆయన రాసిన కథనాలు, వార్తలు పలువురిని కదిలించాయి. ప్రజలను ఆలోచింపజేశాయి. వారి మన్ననలు పొందాయి. అప్పారావు 1992లో సిపిఎం సభ్యత్వం స్వీకరించి ఆ పార్టీలోనూ చురుగ్గా కదిలారు. ఉద్యమాల్లో పాల్గొన్నారు. కోవిడ్ సమయంలో కోవిడ్ బారినపడి, పెరాలసిస్‌కు గురై నాటి నుంచి ఇంటికే పరిమితమయ్యారు. దళిత, పేద కుటుంబం నుంచి వచ్చిన అప్పారావు ఏ రోజూ ఏ ఒక్కరి దగ్గరా చేయి చాచిన దాఖలాలు లేవు. నీతి నిజాయితీ, నిబద్ధతతో పనిచేశారు. ఆయన మృతి పత్రికా రంగానికి తీరనిలోటు.

పలువురు నివాళి

అప్పారావు మృతి విషయం తెలియగానే పలువురు పాత్రికేయులు, ప్రజాసంఘాల నాయకులు తరలివచ్చి ఆయన పార్థివ దేహం వద్ద నివాళులర్పించారు. సిపిఎం నాయకులు ఆయన పార్థివదేహంపై ఎర్రజెండా కప్పి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన మృతి పత్రికా రంగానికి, సిపిఎంకు తీరని లోటని అన్నారు. ఆయన కృషి మరవలేదని కొనియాడారు. నివాళులర్పించిన వారిలో నర్సీపట్నం ట్యాక్స్ పేయర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కె.త్రిమూర్తులు రెడ్డి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆడిగర్ల రాజు, ఎల్.గౌరి, కెవి.సూర్యప్రభ, ఆర్.అప్పలనాయుడు, కె ప్రసన్న ఉన్నారు. అప్పారావు మృతి పట్ల ఎపిడబ్ల్యుజెఎఫ్ అనకాపల్లి జిల్లా గౌరవాధ్యక్షులు జి.కాంతారావు, ఎపిడబ్ల్యుజె రాష్ట్ర నాయకులు స్వామి, ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కిషోర్, నర్సీపట్నం ప్రెస్‌క్లబ్ కార్యదర్శి బేరా బాబ్జీ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి, సిపిఎం సంతాపం

అప్పారావు మృతిపట్ల ప్రజాశక్తి సంపాదకులు బి.తులసీదాస్, సిజిఎం వై.అచ్యుతరావు, జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, ఎడిటోరియల్ బోర్డు సభ్యులు జి.సత్యాజీ, సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం వేర్వేరు ప్రకటనల్లో సంతాపం ప్రకటించారు. అప్పారావు ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు.

దాడులు సరికాదు :అయ్యన్న

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: దేవరాపల్లి మండలం తారువా గ్రామంలో బిజేపి నాయకులపై దాడులు చేయడం ఎంత వరకు సమంజసమని మాజీ మంత్రి, నర్సీపట్నం ఎన్డీఏ కూటమి అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రశ్నించారు. ఆదివారం ఆయన మీడియాకు ఒక వీడియోను విడుదల చేశారు. ఇంత జరుగుతుంటే అక్కడి పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఎన్డీఏకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక బూడి ముత్యాలనాయుడు ఓటమి భయంతో దాడులకు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని, ఇది పద్ధతి కాదన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి -నక్కపల్లి : పాయకరావుపేట నియోజకవర్గం పరిధిలో 1414మంది పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ వేయనున్నారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు 6 పోలింగ్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఈనెల 6 ,7, 8 తేదీల్లో ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ వేయవచ్చు. ఇందుకు గాను అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ప్రచారం చేస్తున్న నాయకులు

ముమ్మరంగా కాంగ్రెస్ ప్రచారం

ప్రజాశక్తి-చీడికాడ: మాడుగుల నియోజకవర్గం ఇండియా ఫోరం బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బొడ్డు శ్రీనివాసరావు ఎన్నిక ప్రచారంలో జోరు పెంచారు. చీడికాడ మండలంలో ఆదివారం సిడిపల్లి, తురువోలు గ్రామాలలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ఎన్నో సుస్థిరమైన సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని శ్రీనివాస్ అన్నారు. రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితే దేశం అభివృద్ధి దిశగా బాటలు వేస్తుందని తెలిపారు. ఓటర్లు తమకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ దేముడు నాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

సచివాలయాల సిబ్బందికి అభినందనలు

ప్రజాశక్తి -నక్కపల్లి: విశాఖ కేజీహెచ్ లో చికిత్స పొందుతున్న మతిస్థిమితం లేని బాలికకు ఉపమాక సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీదేవి ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేశారు. మండలంలోని ఉపమాక పంచాయతీ శివారు మనబాలవానిపాలెం గ్రామానికి చెందిన మనబాల లలిత మతిస్థిమితం సరిగ్గా లేక పోవడంతో విశాఖ కేజీహెచ్ లో చికిత్స పొందుతుంది. దీంతో ఆదివారం వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీదేవి కేజీహెచ్‌కు వెళ్లి లలితకు పింఛన్ నగదును అందజేశారు. దీంతో శ్రీదేవిని అధికారులు, సిబ్బంది అభినందించారు.

గొలుగొండ: గొలుగొండ మండలం కృష్ణదేవిపేట సచివాలయం వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ చిటికెల అప్పలనాయుడు ఆదివారం సెలవు దినమైనా నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కర్రి పెంటయ్యకు పెన్షన్ పంపిణీ చేశారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం మంగళాపురం సచివాలయం మహిళా పోలీస్ మహాలక్ష్మి

పింఛన్ అందజేస్తున్న మహిళా పోలీస్ మహాలక్ష్మి

మానవత్వాన్ని చాటు కున్నారు. గ్రామానికి చెందిన కచ్చా అప్పలరాజు అనారోగ్యంతో బాధ పడుతూ కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. స్పందించిన మహిళా పోలీస్ కెజిహెచ్‌కు వెళ్లి పెన్షన్ పంపిణీ చేశారు. ఆమెను సచివాలయ సిబ్బంది, స్థానికులు అభినందించారు.

గెలిపిస్తే రోడ్డు విస్తరణ పూర్తి చేస్తా

-వైసిపి అభ్యర్థి ఉమాశంకర్ గణేష్

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: మళ్లీ తనను గెలిపిస్తే నర్సీపట్నం మెయిన్ రోడ్డు విస్తరణ పూర్తి చేస్తామని నర్సీపట్నం సిట్టింగ్ ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. నర్సీపట్నం అబీద్ సెంటర్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు పూర్తయిన రోడ్డును ఆయన ఆదివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అబీద్ సెంటర్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ఈ రోడ్డు విస్తరణ చేసి మోడల్ రోడ్డుగా తీర్చిదిద్దామన్నారు. ఈ రోడ్డును ప్రారంభించినప్పటి నుంచి అయ్యన్న పాత్రుడు ఎన్నో అడ్డంకులు తీసుకు వచ్చారన్నారు. చాలా మంది కోర్టులో వేశారన్నారు. అయినా పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీర్చాలనే ఏకైక ఉద్దేశ్యంతో ఎంతో ధైర్యంగా ఈ రోడ్డు విస్తరణకు శ్రీకారం చుట్టామని తెలిపారు. మరలా ఈ ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మిగతా

మాట్లాడుతున్న ఉమాశంకర్ గణేష్

రోడ్డును కూడా పూర్తి చేసి చూపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, మున్సిపాలిటీ అధ్యక్షులు ఏకా శివ, సచివాలయ కన్వీనర్ తమరాన శ్రీను, నాయకులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న మహిళలు

తాగునీటి సమస్యపై ఆందోళన

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలోని కైలాసపట్నం గ్రామ శివారు గిరిజన గ్రామం రాజగోపాలపురంలో గడిచిన పది రోజులుగా తాగునీటి ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. సచివాలయం, గ్రామీణ నీటి సరఫరా అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని ఆదివారం ఆందోళన చేపట్టారు.గ్రామంలో సుమారు 50 గిరిజన కుటుంబాలు ఉన్నాయి. తాగునీరు అందక పోవడంతో అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే తాగునీటి సరఫరా పునరు ద్ధరించాలని కోరుతున్నారు.

ప్రచారం చేస్తున్న అనిత

అనిత ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని ఎన్ నరసాపురం తదితర గ్రామాల్లో ఆదివారం పాయకరావుపేట నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజాగళం యాత్ర చేపట్టారు. కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాలకు సంబంధించి కరపత్రాలను పంపిణీ చేశారు. మేనిఫెస్టోపై అవగాహన కల్పించారు. తనకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. తాను గెలిస్తే గ్రామాల అభివృద్ధితో పాటు అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, నాయకులు కొప్పిశెట్టి కొండబాబు, కురుందాసు నూకరాజు, కొప్పిశెట్టి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పైలా

జోరుగా అయ్యన్న బండారు ప్రచారం

ప్రజాశక్తి-చీడికాడ: సార్వత్రిక ఎన్నికల సమయం సమీపిస్తుండటంతో ప్రధాన రాజకీయ పార్టీలు ప్రచారంలో దూకుడు పెంచాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా మాడుగుల కూటమి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి పార్టీ సీనియర్ నాయకులు పైల ప్రసాద్ రావు, మాడుగుల మాజీ ఎమ్మెల్యే రామానాయుడుతో ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు. చీడికాడ మండలం వరహాపురం గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, మాడుగుల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనని గెలిపించాలని అభ్యర్థించారు. సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. మహిళలకు ఉచిత గ్యాస్లు, ఉచిత ఆర్టీసీ బస్సు, తల్లికి వందనం కింద 15 వేలు రైతులకు 20 వేలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు, సర్పంచ్లు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనకాపల్లిడెస్క్: నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదివారం వినూత్నంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నర్సీపట్నం ఎన్టీఆర్ స్టేడియంలో వాకర్స్‌తో సమావేశమై సభ నిర్వహించారు. నర్సీపట్నం చేపల మార్కెట్, పాత బస్టాండ్‌లో ప్రచారం చేశారు.

ఆడారి ఆనంద్ కుమార్‌ను సన్మానిస్తున్న కాపు నాయకులు

ప్రజా సంక్షేమానికే ప్రాధాన్యత

వైసిపి పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆనంద్‌కుమార్

ప్రజాశక్తి -గోపాలపట్నం : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని పశ్చిమ నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనందకుమార్ చెప్పారు. గోపాలపట్నం కుమారి కల్యాణ మండపంలో కాపు, తెలగ, బలిజ కులాల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ, నియోజవర్గంలో ఉన్న కాపు తెలగ, బలిజ కులస్తుల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ ముందుంటానని, పిలిస్తే పలుకుతానని హామీ ఇచ్చారు. వైసిపి మేనిఫెస్టోను ఓటర్లకు వివరిస్తూ ఓటును అభ్యర్థించాలని సూచించారు. ఎమ్మెల్యేగా తనను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎన్నికల సహా పరిశీలకులు పేడాడ రమణకుమారి, పార్టీ నేతలు పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థి ప్రచారం

ప్రజాశక్తి-పెందుర్తి : పెందుర్తి మండలంలోని ముదపాక, బొడ్డునాయుడుపాలెం, గోవిందపురం, గుర్రంపాలెం గ్రామంలో స్వతంత్ర అభ్యర్థి గుంటూరు వెంకట నరసింహమూర్తి ఆదివారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెందుర్తి నియోజకవర్గ ఏమాత్రం అభివృద్ధి చెందలేదని, మన ప్రాంతం అభివృద్ధి చెందాలంటే తనకు ఒక అవకాశం ఇవ్వాలని కోరారు. అనంతరం మేనిఫెస్టోను వివరించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు భారతి, సాయిప్రియ, వేణుకుమార్, రవికుమార్ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం సిపిఎం అభ్యర్థిని గెలిపించాలి

ప్రజాశక్తి -గాజువాక : స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఇండియా ఫోరం బలపరిచిన గాజువాక నియోజవర్గం సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు కోరారు. జివిఎంసి 74వ వార్డు పరిధి దల్లివానిపాలెం, ఎస్సీ కాలనీ, అంబేద్కర్ కాలనీ, వియ్యపువానిపాలెం, సమతా నగర్ జంక్షన్ ప్రాంతాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించాలని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, అటువంటి పార్టీకి టిడిపి, వైసిపిలు మద్దతిస్తున్నాయని తెలిపారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే స్టీల్‌ప్లాంట్ సమస్యపై పోరాటం చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ ప్రచారంలో సిపిఎం నాయకులు బి.జగన్, గుర్రప్ప, నమ్మి రమణ, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎం.జగ్గునాయుడు గెలుపు కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన 64వ వార్డు పరిధి సత్యనారాయణపురం, గొడ్డువానిపాలెంలో ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో ఏపీ ఫిషర్‌మెన్ కాంగ్రెస్ కో-ఆర్డినేటర్ కొవిరి దేముడు, కాంగ్రెస్ నాయకులు శంకర్‌రెడ్డి, ఎస్సీ సెల్ సెక్రటరీ పెద్దాడ అప్పలరాజు మాట్లాడుతూ, ఈ ఎన్నికలలో

74వ వార్డులో ప్రచారం చేస్తున్న ఎం.జగ్గునాయుడు తదితరులు

విశాఖ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి సత్యారెడ్డిని, గాజువాక ఎమ్మెల్యేగా సిపిఎం అభ్యర్థి ఎం.జగ్గునాయుడును గెలిపించాలని కోరారు. స్టీల్ ప్లాంట్ లాంటి ప్రభుత్వరంగ సంస్థలు రక్షించుకోవాలంటే ఇండియా ఫోరం అభ్యర్థులను గెలిపించు కోవాల్సిన అవసరం ఉందని వివరించారు. ఈ ప్రచారంలో సిపిఎం నాయకులు ఎ.నూకరాజు, రాజు, సత్యారావు పాల్గొన్నారు.

సెలెస్ట్ సమస్యల పరిష్కారానికి కృషి

సెలెస్ట్ అపార్ట్‌మెంట్ వాసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎం.జగ్గునాయుడు హామీ ఇచ్చారు. సెలెస్ట్‌లో ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ, ఈ అపార్ట్‌మెంట్‌కు కనీస సదుపాయాల కల్పనకు కృషిచేస్తానని చెప్పారు. పార్కు, గ్రీనరీ ఏర్పాటుచేయిస్తానని హామీ ఇచ్చారు. సిపిఎం అభ్యర్థులు చట్టసభల్లో ఉంటే 100 శాతం న్యాయం జరుగుతుందన్నారు. తనకు ఎమ్మెల్యేగా గెలిపించి చట్టసభకు పంపిస్తే చెత్త, ఆస్తి పన్ను రద్దుకోసం పోరాటం చేస్తానని చెప్పారు. ఆధునిక పారిశ్రామిక విధానంపై పని చేస్తానని తెలిపారు. యువతకు ఉద్యోగ అవకాశాలు రావాలంటే ఆధునిక పారిశ్రామిక విధానం రావాలన్నారు. సుందరయ్య కాలనీ ఫౌండర్ ఎస్‌వికె.పరుశురాం అధ్యక్షతన జరిగిన ఈ సభలో వార్వా, నివాస్ నాయకులు కిరీటం, త్రినాథ్ స్వామి, సెలెస్ట్ సి బ్లాక్ అధ్యక్షులు పవన్, బి బ్లాక్ అధ్యక్షులు దామోదరరావు, ఏ బ్లాక్ అధ్యక్షులు మల్లేశ్వరరావు, తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బాండ్ పేపర్‌పై 'జైభారత్' వాగ్దానాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : తాము ఇచ్చే వాగ్దానాలకు చట్టబద్ధత కల్పించేందుకు రూ.100 బాండ్ పేపర్‌పై రాసి ఇస్తున్నామని జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు, ఉత్తర నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి వివి.లక్ష్మీనారాయణ చెప్పారు. సీతమ్మధారలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తాము బాధ్యతతో కూడిన రాజకీయాలు చేయడానికి వచ్చామని, మాయమాటలు చెప్పి ప్రజలను ఏమార్చడానికి రాలేదని తెలిపారు. ఉత్తర నియోజకవర్గం ప్రజలు తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే సమస్యలన్నీ పరిష్కరించి ఉత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. తన హామీలకు చట్టబద్ధత కల్పించేలా 34 అంశాలతో కూడిన బాండ్ పేపర్‌ను ఆయన విడుదల చేశారు. తమ పార్టీ నుంచి పోటీ చేస్తున్న మిగతా అభ్యర్థులందరూ ఆయా నియోజకవర్గాల సమస్యలపై బాండ్ పేపర్‌పై రాసి హామీ ఇస్తున్నారని తెలిపారు. విభజన హామీలు అమలు చేయని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వని బిజెపికి టిడిపి, జనసేన ఏ విధంగా మద్దతు పలుకుతున్నాయని ప్రశ్నించారు. గత ఐదేళ్లలో చేసిన అప్పులపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని పరిశీలించడానికి వెళ్తున్న జాహ్నవి

నేటి నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

- అనకాపల్లి నియోజకవర్గం ఆర్ఓ జాహ్నవి

ప్రజాశక్తి -అనకాపల్లి

ఈ నెల 6, 7, 8 తేదీలలో జరిగే పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో అర్హులందరూ పాల్గొనాలని అనకాపల్లి నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి అన్నారు. అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన పోలింగ్ పర్సనల్ అత్యవసర సర్వీసుల వారికి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహించుటకు గవరపాలెం జివిఎంసి బాలుర హైస్కూల్ (చిన్న హైస్కూల్)లో సౌకర్యం కేంద్రం ఏర్పాటు చేశారు. ఆ కేంద్రాన్ని ఆర్ఓ జాహ్నవి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ 6, 7, 8 తేదీలలో ఉదయం 7గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు మూడు రోజులు పాటు జరుగుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులు, వ్యవసాయ సర్వీసుల ఉద్యోగులు వినియోగించుకోవాలని కోరారు. ఆర్ఓ వెంట కసింకోట తాసిల్దార్ మధుసూధన తదితరులు ఉన్నారు.

నేడు దేవరాపల్లి మండల పరిషత్తు సమావేశం

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 6న సోమవారం 11 గంటలకు ఎంపిడిఓ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీవో సిహెచ్ సుబ్బలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్తు ఉపాధ్యక్షులు -1, 2 అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందని, మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

అనకాపల్లి జిల్లాలో కడప రౌడీయిజం

-సిఎం.రమేష్‌పై చర్యలు తీసుకోవాలి
-సిపిఎం నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-అనకాపల్లి

పచ్చని పల్లెలతో ప్రశాంతంగా ఉండే అనకాపల్లి జిల్లాలో కడప నుంచి దిగుమతైన బిజెపి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ కడప ఫ్యాక్షనిజాన్ని పరిచయం చేస్తూ అల్లర్లు, గలాటాలు సృష్టిస్తున్నారని సిపిఎం నాయకులు విమర్శించారు. జిల్లాలో రౌడీయిజానికి కారణవుతున్న సిఎం.రమేష్‌పై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఎన్నికల సంఘాన్ని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి గంట శ్రీరామ్, నాయకులు నాగిరెడ్డి సత్యనారాయణ, అల్లు రాజు, డి.శ్రీనివాసరావు మాట్లాడారు. తన ఎన్నికల ప్రత్యర్థి ఇంటిపైకి 200 మంది పైగా ఇతర ప్రాంతాల నుండి వచ్చిన వారిని తీసుకొని వెళ్లి, పోలీసులు చెబుతున్నా వినకుండా మొండిగా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ తారువ గ్రామంలో అక్రమంగా బైఠాయించి, స్థానికులపై దౌర్జన్యం చేయడమే కాకుండా, తనపైనే దాడి జరిగిందని సీఎం రమేష్ ముసలి కన్నీరు కార్చడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఇళ్లపై డ్రోన్లు ఎగరేస్తూ ఇంట్లో ఉండే మహిళలు చిన్నపిల్లలు రక్షణకు ప్రమాదంగా మారిన ఈ సంస్కృతిని నివారించాలని కోరారు. ఒక ఇండిపెండెంట్ అభ్యర్థి తరపున సిఎం.రమేష్ వకల్తా పుచ్చుకుని దాడి చేయడాన్ని చూస్తుంటే కేంద్రంలో బిజెపి అధికారంలో

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు గంటా శ్రీరామ్

ఉన్నాం కాబట్టి ఏం చేసినా చెల్లుతోందనుకుంటే ఉత్తరాంధ్రలో అలాంటి పప్పులు ఉడకవని హెచ్చరించారు. ఇలాంటి చర్యలకు పూనుకుంటే ఏ పార్టీ వారైనా ఉపేక్షించేది లేదన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా అధికారి యంత్రాంగం తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ప్రధాని మోడీ వీటికి సమాధానం చెప్పాలి

అనకాపల్లి జిల్లా కశింకోటలో సోమవారం పర్యటిస్తున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, విశాఖ రైల్వే జోను, మెట్రో రైలు ప్రాజెక్ట్, నుజల స్రవంతి, సుగర్ ఫ్యాక్టరీల ఆధునికీకరణ, ఆంధ్రకు ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు, కడప స్టీల్ ప్లాంట్, ఉత్తరాంధ్ర వెనుకబడిన జిల్లా ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వకుండా అన్యాయం చేయడంపై సమాధానం చెప్పాలని సిపిఎం నాయకులు గంటా శ్రీరామ్ డిమాండ్ చేశారు. వీటిపై మోడీ చేత బిజెపి అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ సమాధానం చెప్పించి, అప్పుడు ఓట్లు అడగాలని స్పష్టం చేశారు. కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాసే బీజేపీ అభ్యర్థి సీఎం రమేష్‌ని ఓడించాలని పిలుపునిచ్చారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని విరిగిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని కసింకోట - బంగారుమెట్ట రోడ్డులో కందిపూడికి సమీపంలో కశింకోట విద్యుత్ సబ్ స్టేషన్ నుండి విద్యుత్ సరఫరా అయ్యే 32 కెవి విద్యుత్ స్తంభాన్ని ఆదివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అది విరిగిపోయింది. విద్యుత్ వైర్లు తాటి చెట్లపై పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఆగిపోయింది. తెల్లవారుజామున మూడున్నర గంటల సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు వేసవి తాపంతో విలవిలాడారు.

ఎస్‌బివి విశాఖ మాడ్యూల్ చీఫ్ రీజనల్ సెక్రటరీగా ఎన్నికైన సూర్యప్రకాష్‌తో సహచరులు, ఉద్యోగులు

ఎస్‌బివి విశాఖపట్నం మాడ్యూల్

చీఫ్ రీజనల్ సెక్రటరీగా సూర్య ప్రకాష్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విశాఖపట్నం మాడ్యూల్ పరిధిలోని విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఎస్‌బిఐ ఆఫీసర్స్ అసోషియేషన్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఈ ఎన్నికలలో చీఫ్ రీజనల్ సెక్రటరీగా బి.సూర్యప్రకాష్ ఘన విజయం సాధించారు. అలాగే డిప్యూటీ రీజనల్ సెక్రటరీగా టి.గోవిందరాజులు, బాలే రమేష్ నాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా (మహిళ) కానూరి స్రవంతి గెలుపొందారు. ఈ నేపథ్యంలో సూర్య ప్రకాష్ చీఫ్ రీజనల్ సెక్రటరీగా ప్రమాణ స్వీకారం చేసి పదవీ బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో సార్బ్ (ఎస్ఎఆర్‌బి) సిబ్బంది ఎన్.రమణ, బంగారు నాయుడు, సుబ్రహ్మణ్యం, రవిశేఖర్, ఆనంద్, అప్పారావు, సూర్యారావు, అధిక సంఖ్యలో ఎస్‌బిఐ ఆఫీసర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూర్యప్రకాష్ మాట్లాడుతూ తోటి సహచరులంతా తమ అనుభవాన్ని, సమర్థతను పరిగణలోనికి తీసుకొని తమను గెలిపించారన్నారు. జనరల్ సెక్రటరీ డి.కిషోర్ కుమార్ సూచనలు, సలహాలతో విశాఖ మాడ్యూల్‌ను శక్తివంతంగా మారుస్తామన్నారు.